సాక్షి
పార్వతీపురం మన్యం

సోమవారం । 8 । జనవరి । 2024



కూరగాయల సాగుతో లాభాలు

జిల్లాలో మెట్ట పంటలైన చెరకు, పొగాకు, జనప నార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు లాభాలు ఆర్జించే పంటలపై ప్రస్తుతం మొగ్గుచూపుతున్నారు. - 8లో



అధికారుల మధ్య సమన్వయ లోపం

గత టీడీపీ పాలకులు ఓట్ల రాజకీయం చేసి వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులను అడ్డుకున్నారు. - 8లో



మద్యం అక్రమ అమ్మకాలపై దాడి

స్థానిక సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని దేశపాత్రునిపాలెం, చిన్నిపాలెం గ్రామాల్లో మద్యం అక్రమ అమ్మకాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. - 8లో

ఆర్టీసీలో పండగ సందడి



- జిల్లా నుంచి సంక్రాంతికి 308 ప్రత్యేక బస్సులు
- ఈ నెల 10 నుంచి 15 వరకూ ప్రత్యేక సర్వీసులు
- తిరుగు ప్రయాణంలో 16 నుంచి 22 వరకు
- హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి విశాఖపట్టణానికి సర్వీసులు
- రానుపోను టిక్కెటు బుకింగ్‌పై పది శాతం రాయితీ
- రవాణాకు బస్సులు సిద్ధం

తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి వేళ ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆర్టీసీలు సర్వీసులు నడిపేందుకు నిర్ణయించింది. ఈ మేరకు అందుకనుగుణంగా ప్రతి రోజూ ఏ రూట్లో ఎన్ని సర్వీసులు నడపాలో చర్యలు చేపట్టింది. ప్రైవేటు బస్సుల దోపిడీ నుంచి ప్రయాణికులను తప్పించేందుకు ఆర్టీసీ నిర్ణయించి ధరలు కూడా పెంచకుండా సర్వీసులు నడపనుంది. అదే సమయంలో రాక, పోకలకు సంబంధించి ఒకేసారి టిక్కెట్ తీసుకునే వారికి పది శాతం రాయితీ కూడా ఇస్తోంది.

పార్వతీపురం టౌన్: ఆర్టీసీలో సంక్రాంతి సందడి మొదలవుతోంది. తెలుగువారి పెద్ద పండగకు సొంతూరు వచ్చి వెళ్లే ప్రయాణికులకు ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లను చేస్తోంది. సాధారణంగా పండగల వేళ ప్రైవేటు బస్సు ఆపరేటర్లు అధిక చార్జీలతో ప్రయాణికులను దోచుకుంటున్న విషయం తెలిసిందే. దీనిని అరికట్టి, సాధారణ చార్జీలతోనే ప్రత్యేక బస్సులు నడపాలని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశాలు ఇచ్చింది. హైదరాబాద్, విజయవాడ, రాజమండ్రి, విశాఖపట్నం తదితర దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారి కోసం, తిరుగు ప్రయాణాలకు జిల్లాలోని పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల నుంచి 308 ప్రత్యేక బస్సులు, 531 షెడ్యూల్ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. ప్రత్యేక బస్సులు నడిపే అంశంపై జిల్లా ప్రజా రవాణా అధికారి టీవీఎస్ సుధాకర్ మూడు డిపోల మేనేజర్‌లు, అధికారులతో ఇటీవల సమీక్ష నిర్వహించి పూర్తి స్థాయి ఆదేశాలు జారీ చేశారు. ప్రయాణికులకు ఏటువంటి అసౌకర్యం కలగకుండా సమయానికి బస్సు సర్వీసులు ఉండేలా చర్యలు చేపట్టారు.

జిల్లా నుంచి సంక్రాంతి ప్రత్యేక సర్వీసులు ఇలా..

డిపో	హైదరాబాద్	విజయవాడ	రాజమండ్రి	విశాఖపట్టణం
పాలకొండ	4	8	0	90
పార్వతీపురం	6	7	9	90
సాలూరు	4	0	0	90
మొత్తం	14	15	9	270

హైదరాబాద్‌కు సర్వీసులు ఇలా..

ప్రస్తుతం పార్వతీపురం మన్యం జిల్లా నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడవకపోవడం, 14 ప్రైవేటు బస్సుల ఆపరేటర్లు నడుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని చెక్ పెట్టేందుకు సంక్రాంతి పండగను పురస్కరించుకుని అదనంగా ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. ఇప్పటికే ప్రైవేటు ఆపరేటర్లు హైదరాబాద్‌కు రూ.1800 నుంచి రూ.3000 వసూలు చేస్తున్నారు. ఆర్టీసీలో మాత్రం రూ.1410లతో సూపర్ లగ్జరీ, రూ.1325లతో అల్ట్రా డీలక్స్ బస్సులలో ప్రయాణించవచ్చు. దీంతో ప్రయాణికులు చూపు ఆర్టీసీ వైపు మళ్లుతోంది.

10 శాతం రాయితీ..

గతంలో ఏసీ బస్సులకు మాత్రమే రాయితీ సౌకర్యం ఉండేది. ప్రభుత్వాదేశాల మేరకు ఏసీ, అల్ట్రా డీలక్స్, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ వంటి అన్ని సర్వీసులకు రానుపోను ఒకేసారి టికెట్ తీసుకున్న సంక్రాంతి ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించారు. ప్రత్యేక సర్వీసులకు అదనపు చార్జీలు లేకుండా పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో ఉంచుకోని 10 శాతం రాయితీ కల్పించడంతో ప్రయాణికులు ఆర్టీసీ వైపు మొగ్గు చూపుతున్నారు. ముందుగానే రిజర్వేషన్లు సైతం చేసుకుంటున్నారు.

విజయవాడ, విశాఖపట్నానికి ఇలా..

జిల్లా నుంచి విజయవాడకు ప్రస్తుతం రోజుకు 7 ఆర్టీసీ బస్సులు నడుస్తుండగా.. పండగ సందర్భంగా ప్రతీ రోజూ మూడు డిపోల నుంచి 2 చొప్పున 15 అదనపు సర్వీసులు నడపనున్నారు. జిల్లా నుంచి విశాఖపట్నానికి ప్రతీ రోజూ 85 బస్సులు సర్వీసులు ఉండగా ప్రతీ రోజూ డిపోకు 10 చొప్పున మూడు డిపోల నుంచి 30 అదనపు బస్సులను నడపనున్నారు. సంక్రాంతి సెలవులు, తిరుగు ప్రయాణాల సందర్భంగా ఎవరు, ఎక్కడికి, ఎన్ని టిక్కెట్లు అడిగినా ఇచ్చేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా టిక్కెట్లు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఉద్యోగులకు సెలవులు తగ్గించి మరీ బస్సు సర్వీసులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. అందుకు ఉద్యోగులు సైతం సహకరిస్తున్నారు.

అసౌకర్యం కలగకుండా చర్యలు



సంక్రాంతి పండగ సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు ఏర్పాటు చేసి ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు రానుపోను ఒకేసారి టికెట్ తీసుకున్న సంక్రాంతి ప్రయాణికులకు చార్జీలో 10 శాతం రాయితీ కల్పించాం. జిల్లా నుంచి హైదరాబాద్‌కు 14 బస్సులు, ప్రతీ రోజూ విజయవాడకు 15 అదనపు సర్వీసులు, విశాఖపట్టణానికి 270 బస్సులను ఏర్పాటు చేశాం. ప్రయాణికులందరూ ఆర్టీసీ సేవలు వినియోగించుకోవాలి.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం

న్యూస్‌రీల్

అదనంగా ధాన్యం తీసుకుంటే చర్యలు : కలెక్టర్



నిషాంత్‌కుమార్

పార్వతీపురం: రైతుల నుంచి అదనంగా ధాన్యాన్ని తీసుకుంటే మిల్లర్లపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. రైతులు ఒక్క గింజ ధాన్యం కూడా అదనంగా మిల్లర్లకు ఇవ్వరాదని, ఎవరైనా అడిగితే వెంటనే ధాన్యం కొనుగోలు జిల్లా కంట్రోల్ రూం నంబర్ 08963-293037, 7702003582, కలెక్టర్ సీసీ 8333813243 నంబర్లకు సమాచారాన్ని ఇవ్వాలని ఆయన కోరారు. రైతులను దోపిడీ చేసేందుకు ప్రయత్నిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని ఆయన స్పష్టంచేశారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను వ్యక్తిగతంగా పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు, వ్యవసాయాన్ని లాభసాటిగా చేసేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలను రైతులు వినియోగించుకోవాలన్నారు. ముఖ్యంగా దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం : డీఈఓ



గ్రాండ్ టెస్టును పరిశీలిస్తున్న డీఈఓ ప్రేమ్‌కుమార్


పార్వతీపురం టౌన్: పదో తరగతి విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ అన్నారు. పట్టణంలోని టీఆర్‌ఎంఎం, డీవీఎం పాఠశాలల్లో ఆదివారం నిర్వహించిన గ్రాండ్ టెస్టును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారికి పూర్తి స్థాయిలో తర్ఫీదులివ్వాలన్నారు. ప్రతీ ఆదివారం ప్రభుత్వ పాఠశాలల్లో గ్రాండ్‌టెస్టులను నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో 50రోజుల ప్రణాళికలు రూపొందించి ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ పాఠశాలను జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారులకు దత్తతనిచ్చి విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లా మలేరియా నివారాణాధికారిగా జగన్‌మోహనరావు



పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా మలేరియా అధికారిగా డాక్టర్ టి.జగన్ మోహనరావును నియమించారు. ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి అధికారికంగా ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇంతవరకు డా.జగన్‌మోహన్‌రావు జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ)గా సేవలు అందించి ఉత్తమ అధికారిగా గుర్తింపు పొందారు. జిల్లా మలేరియా అధికారిగా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. మలేరియా కార్యాలయ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డా.జగన్‌మోహనరావు మాట్లాడుతూ జిల్లాలో మలేరియా నివారణకు కృషి చేస్తానని, అందుకు సిబ్బంది తనకు తోడ్పాటు నందించాలని కోరారు. కార్యక్రమంలో ఏఎంఓ సూర్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వేణు



తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన వేణుగోపాలరావు

విజయనగరం: న్యూ ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికయింది. ప్రధాన కార్యదర్శిగా విజయనగరం జిల్లాకు చెందిన సిహెచ్.వేణుగోపాలరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విశాఖపట్నంలోని లయన్స్ క్లబ్ వేదికగా ఎన్నికలు జరిగినట్లు అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఎన్నికల అధికారిగా నమ్మి శ్రీనివాసరావు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(సీబీడీ) వ్యవహరించగా, ఆంధ్రప్రదేశ్ ఒలింపిక్ అసోసియేషన్ నుంచి మాణిక్యాలరావు, తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి కె.శ్రీహరి పరిశీలకుడిగా హాజరయ్యారు. వీరి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. వేణుగోపాలరావును పలువురు అభినందించారు.

ఆసక్తికరంగా చెకుముకి జిల్లా స్థాయి సంబరాలు



విజేతలతో జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు

విజయనగరం అర్బన్: జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ స్థానిక సంస్కృత కళాశాలలో ఆదివారం నిర్వహించిన చెకుముకి జిల్లా స్థాయి పోటీలు ఆసక్తికరంగా జరిగాయి. తొలి దశలో అన్ని స్కూళ్ల, అన్ని మండల, పట్టణ స్థాయిలో నిర్వహించిన పోటీల విజేతలు దాదాపు 102 మంది జిల్లా స్థాయి పోటీ పరీక్షలో పాల్గొని తమ ప్రతిభ నిరూపించుకున్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ పాఠశాలల విభాగంలో బొబ్బిలి ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, మరడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుసగా ద్వితీయ, తృతీయ స్థానం సాధించారు. ప్రైవేటు పాఠశాల విభాగంలో స్థానిక ఫోర్ట్ సిటీ స్కూల్ విద్యార్థులు ప్రథమ, రాజాం సన్‌స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానాలు సాధించారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచిన వారు ఫిబ్రవరి రెండవ వారంలో చిలకలూరిపేటలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సంబరాలలో జిల్లా తరపున పోటీ పడతారు. జాతీయ స్థాయి సైన్సు రిసోర్సుపర్సన్, అన్వేషిత టాలెంట్ టెస్ట్ కో –ఆర్డినేటర్ డాక్టర్ జోగా చంద్రశేఖర్ చేతుల మీదుగా విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్, రాష్ట్ర సమత విభాగం కన్వీనర్ జి.నిర్మల, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.వెంకటరావు, జిల్లా కార్యదర్శి వి.రమణప్రభాత్, జిల్లా ఉపాధ్యక్షుడు కె.మురళీబాబు పాల్గొన్నారు.

చేసిన అభివృద్ధి, సంక్షేమం చెప్పే ధైర్యం మాకుంది



కె.ఎల్.పురంలో మంచినీటి ట్యాంకర్ ప్రారంభోత్సవంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఇతర ప్రజాప్రతినిధులు

- గతంలో మంత్రులుగా పదవులు అనుభవించిన వారు చెప్పగలరా..?
- రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి
- మహిళలు గౌరవంగా జీవించేలా ప్రభుత్వ విధానాలు
- రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- నగరంలో రూ.4.50 కోట్లతో నిర్మించిన రెండు వాటర్ ట్యాంక్‌లు ప్రారంభం

విజయనగరం:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వంలో విజయనగరంలో చేసిన అభివృద్ధిని, ప్రజలకు అందించిన సంక్షేమాన్ని తాము ధైర్యంగా చెప్పగలమని, గతంలో మంత్రులుగా పదవులు అనుభవించిన వారు చెప్పగలరా..? అంటూ రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ప్రశ్నించారు. గడిచిన నాలుగున్నరేళ్లలో విజయనగరంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశామని, రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి దిశగా ముందుకు వెళ్తామని స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి విజయనగరం కార్పొరేషన్ పరిధిలో 30, 31 డివిజన్ పరిధిలో గల ధర్మపురి, వసంతవిహార్ ప్రజలకు సంబంధించి రూ.2 కోట్ల నిధులతో నిర్మించిన 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ను, 45, 47 డివిజన్ పరిధిలో గల కేఎల్‌పురం ప్రాంత ప్రజలకు సంబంధించి రూ.2.50 కోట్లతో నిర్మించిన 5 లక్షల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్‌ల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు, నగర మేయర్‌లు కలిసి ట్యాంక్‌లు ప్రారంభించటంతో పాటు కుళాయి ద్వారా తాగు నీటి సరఫరాను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ దశాబ్దాలుగా తాగు నీటి కోసం ఇబ్బందులు పడుతున్న రెండు ప్రాంతాల ప్రజల సమస్యకు పరిష్కారం లభించటం సంతోషంగా ఉందన్నారు. నగరంలో నివసిస్తున్న ప్రజలకు రోజుకు 4 కోట్ల లీటర్ల నీరు అవసరం కాగా 2019 వరకు 1.40 కోట్ల లీటర్ల నీరు పంపింగ్ చేశామని, గడిచిన మూడేళ్లలో 60 లక్షల లీటర్ల కెపాసిటీకి పెంచగలిగామని చెప్పారు. అమృత్ స్కీమ్‌లో రూ.62 కోట్లతో ముషిడిపల్లి నుంచి విజయనగరం వరకు 23 కిలోమీటర్ల మేర వాటర్ పైప్ లైన్‌లు మార్పు చేసే అవసరమైన చర్యలు ప్రారంభించామని, ఆ పనులు పూర్తయితే నగర ప్రజలకు ప్రతి రోజు తాగునీటిని సరఫరా చేస్తామన్నారు.

మహిళలు గౌరవంగా జీవించేలా ప్రభుత్వ విధానాలు

రాష్ట్రంలో మహిళలు గౌరవంగా జీవించేలా ప్రభుత్వం వివిధ విధానాలను అమలు చేస్తోందని మంత్రి బొత్స పేర్కొన్నారు. ఇందులో భాగంగా వచ్చే నెలలో ఆసరా పథకం కింద 45 నుంచి 60 ఏళ్ల వయస్సు గల మహిళలకు రూ.18,750 అందజేసి వారికి ప్రభుత్వమే అండగా నిలుస్తుందన్నారు. గతంలో చంద్రబాబు మాయమాటలు నమ్మి ఓట్లేసి గెలిపిస్తే డ్వాక్రా రుణాలను మాఫీ చేస్తామని మోసగించిన వైనాన్ని గుర్తు పెట్టుకోవాలన్నారు. జాబ్ కావాలంటే బాబు రావాలంటూ ప్రచారం చేసుకున్న వారు ఎవరికి ఉద్యోగాలు ఇచ్చారో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. అందుకే 2019 ఎన్నికల్లో అదే మహిళల చేతిలో ఛీత్కారానికి గురయ్యారన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ప్రజలు కట్టబెట్టిన పదవులకు సార్థకత చేకూరేలా పని చేస్తున్నామని చెప్పారు. త్వరలో ఎన్నికలు రానున్నాయని మాయ మాటలకు నమ్మి మోసపోవద్దని, ప్రజలంతా బాగుండాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, శాసనసభ్యులుగా కోలగట్ల వీరభద్రస్వామిని గెలిపించాలని సూచించారు.

ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ధర్మపురి, కేఎల్‌పురం ప్రాంత వాసులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఏడాది వ్యవధిలో రెండు వాటర్ ట్యాంక్‌లు నిర్మించి వేలాది మంది దాహార్తిని తీర్చటం జరుగుతుందన్నారు. తాను శాసనసభ్యునిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి విజయనగరం నగర ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం జరుగుతుందని, ఇందులో భాగంగా వందల సంఖ్యలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నగర ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా కృషి చేశామన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు మాట్లాడుతూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించే నాయకుడు దొరకడం విజయనగరం ప్రజలు చేసుకున్న అదృష్టంగా పేర్కొన్నారు. తమ ప్రభుత్వ పాలనలో విజయనగరం రూపు రేఖలు పూర్తిగా మారాయంటే అందుకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి ఎనలేనిదన్నారు. నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు, కార్పొరేటర్లు పతివాడ గణపతి, తాళ్లపూడి సంతోషి, పట్నాన పైడిరాజు, బోనేల ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శంబర చదురుగుడికి పోలమాంబ



సాలూరు: ఉత్తరాంధ్ర ఇలవేల్పు శంబర పోలమాంబ అమ్మవారు గ్రామంలోని చదురుగుడికి సోమవారం చేరుకుంటారు. ఈ నెల 1వ తేదీన అమ్మవారిని గ్రామంలోకి తీసుకువచ్చేందుకు చాటింపు వేశారు. గోముఖి నది ఒడ్డున సోమవారం రాత్రి అమ్మవారి ఘటాలకు పూజలు నిర్వహించి, మేళతాళాలు, తప్పెడుగుళ్ల కోలాటంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. భక్తుల జయజయ ధ్వానాల మధ్య అమ్మవారిని గ్రామంలోకి ఆహ్వానిస్తారు. గ్రామంలో 14 రోజుల పాటు అమ్మవారి ఘటాల తిరువీధి కార్యక్రమం నిర్వహిస్తారు. ఈ రోజుల్లో చదురుగుడిలో పోలమాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.ఈ నెల 22, 23, 24 తేదీలలో అమ్మవారి జాతర నిర్వహించనున్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం



ఫించన్లు పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని డబ్బివీధి కల్యాణ మండపంలో ఎంపీపీ రాములమ్మ అధ్యక్షతన, ఎంపీడీవో పార్వతి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో అధిక మొత్తంలో పింఛన్‌లు అందజేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలకు మేలు చేస్తున్న జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ప్రతి ఇంట్లో పెద్ద కొడుకులా, మహిళలకు అండగా ముఖ్యమంత్రి నిలుస్తున్నారన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేకువజామునే వలంటీర్లు ఇంటికొచ్చి పింఛన్లు అందజేస్తున్నారన్నారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛన్‌ను రూ.3వేలకు పెంచి పంపిణీ చేస్తున్నామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన ఘనత జగన్ మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. టీడీపీ, జనసేన ఒక్కటిగా ప్రజలను మళ్లీ మోసం చేసేందుకు వస్తున్నాయని తగిన గుణపాఠం చెప్పాలని ఆయన కోరారు. వారి మోసపూరితమైన హామీలకు మోసపోవద్దని సూచించారు. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని సూచించారు. జిల్లా గ్రంథాలయ చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎంసీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్‌శ్రీనివాస్, పార్టీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, జేసీఎస్ మండల కన్వీనర్ కర్లపల్లి త్రినాథ, ప్రజాప్రతినిధులు, నాయకులు, ముప్పల ఆదయ్య, సువ్వాడ రామకృష్ణ పాల్గొన్నారు.

పాలకొండ టికెట్ జనసేనకే..!

- టీడీపీ ఆశావహులకు తప్పదు నిరాశ
- టీడీపీలో వర్గపోరుకు చెక్ పెట్టేందుకే..
- వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమంటున్న సర్వే రిపోర్టులు
- టీడీపీకి వ్యతిరేకత ఉన్న చోట జనసేన అభ్యర్థులకు టిక్కెట్లు!



వీరఘట్టం: పార్వతీపురం మన్యం జిల్లాలోని పాలకొండ నియోజకవర్గం టీడీపీలో టికెట్ ఎవరికి ఇస్తారో తెలియని గందరగోళం నెలకొంది. ముఖ్యంగా ఇక్కడ టీడీపీ గ్రూపుల గోలతో తరచూ రచ్చకెక్కుతుండడం అధిష్టానానికి తలనొప్పిగా మారింది. దీంతో ఇక్కడ టీడీపీ అభ్యర్థి ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. పాలకొండ టీడీపీలో ఎప్పటి నుంచో ఉన్న వర్గ పోరు గతేడాది జూలై 12న చంద్రబాబు చేపట్టిన బస్సుయాత్రలో బహిర్గతమైంది. బస్సు యాత్రకు వచ్చిన చంద్రబాబు వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్‌లో బహిరంగ సభలో మాట్లాడారు. టీడీపీ అభ్యర్థిగా నిమ్మక జయకృష్ణ పేరు ప్రకటిస్తారని అతని వర్గీయులు ఆశించారు. అయితే చంద్రబాబు కనీసం జయకృష్ణ పేరు ప్రస్తావించకపోవడం అప్పట్లో చర్చనీయాంశమైంది. దీంతో నియోజకవర్గంలో ఉన్న నిమ్మక జయకృష్ణ, పడాల భూదేవి వర్గీయులు చాపకింద నీరులా ఒకరిపై ఒకరి కత్తులు దూసుకుంటున్నారు. వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ టీడీపీలో వీరు వర్గపోరుకు బీజం పోస్తున్నారని టీడీపీ సీనియర్ నాయకులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇదిలా ఉండగా ఈ వర్గ పోరుకు టీడీపీ అధిష్టానం చెక్ పెట్టేందుకు ఇక్కడ ప్రత్యామ్నాయంగా జనసేన అభ్యర్థికి టికెట్ ఇస్తారనే ప్రచారం ముమ్మరంగా జరుగుతుంది.

తమ అభ్యర్థులకు వ్యతిరేకత ఉన్నచోట జనసేనకు టికెట్లు ఇచ్చే యోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్టు టీడీపీ నాయకులే చెబుతుండడం గమనార్హం. ఇక్కడ జనసేనకే టికెట్ ఇస్తే ఇన్నాళ్లు టీడీపీని నమ్ముకున్న నిమ్మక జయకృష్ణకు నిరాశ తప్పదని, భూదేవికి భంగపాటే మిగులుతుందని ప్రజలు చర్చించుకుంటున్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఏది ఏమైనా పాలకొండ నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుపు తథ్యమని, ఈమె హ్యాట్రిక్ విజయం సాధించడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఈమె హయాంలోనే పాలకొండ నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు పేర్కొంటున్నారు.

ఫోన్ కాల్స్ కలకలం

పాలకొండ టీడీపీ టికెట్ ఎవరికిస్తే బాగుంటుందని ఇటీవల టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు వాయిస్‌తో వచ్చిన ఫోన్ కాల్స్ టీడీపీలో కలకలం రేపాయి. ఇవి బోగస్ ఫోన్స్ కాల్స్ అని టీడీపీలో ఓ వర్గం కొట్టిపడేసింది. ఇదిలా ఉండగా 2004 నుంచి వరుసగా నాలుగుసార్లు ఇక్కడ టీడీపీ అభ్యర్థులు ఓడిపోయారు. ఇందులో 2004, 2009లో మాజీ ఎమ్మెల్యే దివంగత నిమ్మక గోపాలరావు టీడీపీ తరఫున పోటీ చేసి ఓడిపోయారు. తర్వాత వరుసగా 2014, 2019లలో జరిగిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతిపై గోపాలరావు తనయుడు జయకృష్ణ టీడీపీ తరఫున పోటీచేసి ఓడిపోయారు. ఇక 2024లో వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విశ్వాసరాయి కళావతి గెలుస్తుందని సర్వే రిపోర్టులు చెబుతున్నాయి.

క్లుప్తంగా

సీతారామస్వామికి ప్రత్యేక పూజలు



వెండి మంటపం వద్ద పూజలు చేస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో స్వామికి ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. వేకువజామున ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో విశేష హోమాలు జరిపించారు. అనంతరం ఆస్థాన మంటపంలో సీతారామస్వామికి నిత్యకల్యాణం, పట్టాభిషేక మహోత్సవాలను వైభవంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, వరప్రసాద్, రామగోపాల్ పాల్గొన్నారు.

కోడి పందాల స్థావరంపై దాడులు



కోడి పుంజులతో పందాల రాయుళ్లు

బొబ్బిలి: కోడి పందాలు ఆడుతున్న శిబిరంపై పోలీసులు దాడి చేసి 15 కోడి పుంజులను ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు మండలంలోని వాకాడ వలస శివారులోని అమ్మవారి గుడి వద్ద భారీగా కోడిపందాలు జరుగుతున్నాయనే సమాచారం అందుకున్న ఎస్సై వి జ్ఞాన ప్రసాద్ తన సిబ్బందితోవెళ్లి 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. కోడి కత్తులను, 15 కోడి పుంజులను, పందెం బరిలో ఉంచిన రూ.31,260లను స్వాధీనం చేసుకున్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై జ్ఞానప్రసాద్ ఈ సందర్భంగా తెలిపారు.

కార్టూనిస్టుకు ప్రథమ బహుమతి



బహుమతి పొందిన కార్టూన్ ఇదే

గరుగుబిల్లి: మండలంలోని రావివలసకు చెందిన ప్రముఖ కార్టూనిస్టు గుంట్రెడ్డి భాస్కర రావు (భాను)కు విజయవాడలోని గుళ్లపల్లి అరుణకుమారి స్మారక సాహిత్య సంస్థ ఆధ్వర్యంలో హాస్యానందం పత్రిక సౌజన్యంతో నిర్వహించిన తెలుగు కార్టూన్ పోటీల్లో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా భాను మాట్లాడుతూ న్యూ సంతాన సాఫల్యానికి సంబంధించిన కార్టూన్‌ను తాను ఆ పోటీలకు పంపించగా ప్రథమ బహుమతి లభించిందని సంతోషం వెలిబుచ్చారు. ఈనెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా విజయవాడలో జరిగే కార్యక్రమంలో నగదు బహుమతితోపాటు ప్రశంసాపత్రాన్ని అందజేస్తారని తెలిపారు. కార్టూనిస్టు భాస్కరరావు 40 ఏళ్లుగా భాను పేరుతో కార్టూన్‌లు వేస్తూ ప్రశంసలు అందుకుంటున్నారు.

డెల్టా విజేతల ఫలితాల విడుదల



విజేతలతో డెల్టా కార్యవర్గం

బొబ్బిలి: ఇంగ్లీషు ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మింది విజయమోహన రావు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు ఇంగ్లీషు పాఠ్యాంశాల్లో ప్రతిభా పోటీలను నిర్వహించారు. ఆదివారం శ్రీ కళాభారతి మున్సిపల్ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ పోటీల్లో ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లా నుంచి 232 మంది పదో తరగతి విద్యార్థులు హాజరయ్యారు. పార్వతీపురం మన్యం బలిజిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం జ్యోతి ముఖ్య అతిథిగా హాజరై ఫలితాలను విడుదల చేశారు. విజేతలుగా బి.దుర్గా ప్రసాద్,అల్లు అశోక్(పాల్తేరు), జి.విశాలాక్షి (కొత్తూరు),బి.ఉపేంద్ర, జి నవీన్ (బీజే పురం),వి కుసుమలత(సాలూరు)లకు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో డెల్టా సభ్యులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹90	₹150	₹160

కూరగాయల సాగుతో లాభాలు బాగు

- జిల్లాలో 1500 హెక్టార్ల విస్తీర్ణంలో పంటలు
- ఉత్తరాంధ్రతో పాటు ఉభయగోదావరికి కూరగాయల ఎగుమతి



చౌడువాడలో సాగవుతున్న బీరపంటను చూపిస్తున్న రైతులు

పూసపాటిరేగ: జిల్లాలో మెట్ట పంటలైన చెరకు, పొగాకు, జనపనార సాగుపై ఒకప్పుడు ఆధారపడిన రైతులు లాభాలు ఆర్జించే పంటలపై ప్రస్తుతం మొగ్గుచూపుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వైపరీత్యాలు సంభవించడంతో వరి, పత్తి, మినుము పంటలు సాగుచేస్తున్న రైతులు నష్టపోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రత్యామ్నాయంగా కూరగాయ పంటల సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో 1500 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్, 1000 హెక్టార్లలో రబీ సీజన్‌లో కూరగాయలు సాగవుతున్నా యి. జిల్లాలో అత్యధికంగా రామభద్రపురం, జామి, నెల్లిమర్ల, మెంటాడ, పూసపాటిరేగ, బొండపల్లి మండలాల్లో అత్యధికంగా కూరగాయలు సాగు చేస్తున్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలకు ఇక్కడి నుంచే కూరగాయలు తరలిస్తున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలనే ఉద్దేశంతో కూరగాయల సాగు చేస్తున్నారు. వర్షాకాలంలో ఇతర ప్రాంతాల్లో కూరగాయల సాగు గణనీయంగా తగ్గి దిగుమతులు తగ్గినప్పుడు ఇక్కడ పండించిన కూరగాయలకు మంచి గిరాకీ పెరిగి లాభాలు వస్తాయని పలువురు రైతులు చెబుతున్నారు. చాలా మంది రైతులు వరి పండించే పల్లపు భూముల్లో కూరగాయలు సాగు చేస్తున్నారు.

మార్కెట్‌లో ధరలు బట్టి లాభాలు

పూసపాటి రేగ మండల పరిధిలో ఎక్కువగా బీర, బెండ, వంకాయ, చిక్కుడు, గోరుచిక్కుడు. గుమ్మడి, సొరకాయ, కర్రపెండలం, మునగ, క్యాబేజీ వంటి ఉద్యానవన పంటలు సాగు చేస్తున్నారు. ఎకరా కూరగాయల సాగుకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు ఖర్చు అవుతోంది. ఎకరాకు సుమారు రూ.లక్ష పైబడి ఆదాయం వచ్చే అవకాశం ఉందని సాగు రైతులు చెబుతున్నారు.



రోలుచప్పిడిలో సాగవుతున్న బీర

విత్తనాలకు రాయితీ



కూరగాయల పంట సాగు చేసే రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు హెక్టార్ విస్తీర్ణంలో సాగు చేయడానికి విత్తనాలకు రూ.3 వేల వరకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. హైబ్రిడ్ వెజిటబుల్ స్కీమ్ ద్వారా రాయితీలు ఉన్నాయి. తీగజాతి కూరగాయల సాగు చేసే రైతులకు శాశ్వత పందిళ్లు వేయడానికి ప్రభుత్వం రాయితీ మంజూరు చేస్తుంది.

జ్యోత్స్న, ఉద్యానవనశాఖ అధికారి భోగాపురం

కూరగాయల పంటలకు రాయితీలు ఇవ్వాలి



కూరగాయలు సాగు చేసే రైతులకు రాయితీలు ఇవ్వాలి. ఇతర పంటలు సాగు చేయడం వల్ల దిగుబడులు లేక మద్దతు ధర లేకపోవడంతో ఎక్కువ మంది కూరగాయల సాగుపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వర్షాకాలంలో పంటనష్టపోయిన రైతులకు రాయితీలు కల్పించాలి.

అకుల మహాలక్ష్మినాయుడు, రైతు కనిమెల్ల

అధికారుల మధ్య సమన్వయ లోపం

- రహదారి విస్తరణ పనులకు శాపం
- రూ.5.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వీరఘట్టం రోడ్డు



వీరఘట్టం అంబేడ్కర్ జంక్షన్‌లో పైప్‌లైన్ల రిపేర్ కోసం ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తవ్వేసిన గుంత

వీరఘట్టం: గత టీడీపీ పాలకులు ఓట్ల రాజకీయం చేసి వీరఘట్టం ప్రధాన రహదారి విస్తరణ పనులను అడ్డుకున్నారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మాత్రం మాకు ఓట్లు ముఖ్యం కాదు వీరఘట్టం పట్టణ అభివృద్ధే మా లక్ష్యం అంటూ రూ.5.50 కోట్ల వ్యయంతో రెండేళ్ల క్రితం వీరఘట్టం ప్రధాన రహదారి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. ఈ క్రమంలో ఈ పనులతో సంబంధమున్న ఆర్ అండ్‌బీ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల మధ్య సమన్వయ లోపం రోడ్డు పనులకు శాపంగా మారింది. రోడ్డు అంతర్భాగంలో తాగునీటి పైపులైన్స్ అమర్చడంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మొద్దునిద్ర వహిస్తుండడంతో రోడ్డు పనులకు అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్డును చదును చేస్తుండడం, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పైప్‌లైన్లు ఏర్పాటు కోసమంటూ గుంతలు తవ్వడంతో రోడ్డు పనులకు తీవ్ర ఆటంకంగా మారింది.ముఖ్యంగా రోడ్డు పనులపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడం గమనార్హం. రెండు రోజుల క్రితం బీటీ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఇంతలో ఆర్‌డబ్ల్యూ ఎస్ అధికారులు అంబేడ్కర్ జంక్షన్లో శుక్రవారం గుంతలు తవ్వేయడంతో బీటీ పనులు ఆగిపోయాయి. సంక్రాంతి పండగలోగా వీరఘట్టం రోడ్డు పనులు పూర్తవుతాయని ఆశించిన పట్టణ ప్రజలకు నిరాశే మిగులుతోంది.

పద్ధతి కాదు

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీరఘట్టం రోడ్డు పనులకు నిధులు మంజూరు చేసిందని, అధికారుల సమన్వయ లోపంతో రోడ్డు పనులను గాలికొదిలేయడం సరికాదని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.ఎట్టి పరిస్థితుల్లోనూ సంక్రాంతి పండగలోగా రోడ్డు పనులు పూర్తి చేయాలని అధికారులను సమన్వయం చేస్తున్నారు.

జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ మానుకోవాలి



వార్షిక క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఏఐబీఈఏ ప్రతినిధులు

- బ్యాంక్ ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక జిల్లా కమిటీ డిమాండ్

విజయనగరం అర్బన్: జాతీయ బ్యాంకుల ప్రైవేటీకరణ చర్యలను మానుకోవాలని అఖిల భారత బ్యాంక్ ఉద్యోగుల సమాఖ్య (ఏఐబీఈఏ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జిల్లా కమిటీ ప్రతినిధులు స్థానిక అమర్ భవనంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ మేరకు పేర్కొన్నారు. తొలుత వార్షిక క్యాలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలో ఉన్న బ్యాంకులన్నింటినీ కొంత మంది బడా కార్పొరేట్ వ్యక్తుల చేతుల్లో పెట్టాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. ప్రజలు ప్రభుత్వ రంగ బ్యాంకుల మీద ఉన్న నమ్మకంతో వారి వద్ద ఉన్న నగదును ఆయా బ్యాంకుల్లో దాచుకుంటున్నారని, అటువంటి వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో శాశ్వత ఉద్యోగ నియామకాలను జరపకుండా ఒప్పంద ఉద్యోగుల నియామకాలను జరపడానికి ప్రయత్నిస్తున్నారని ఈ చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ అధ్యక్షుడు బీవీప్రసాద్, కార్యదర్శి మురళి శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్లు ఎం.చిన్నారావు, ఎ.వెంకటరావు, ఎ.శర్మ, హరీష్, జాయింట్ సెక్రటరీ టి.రవికుమార్, వి.శ్రావణ్‌కుమార్, మనోజ్ వర్మ, పి.శ్రీనివాసరావు, జీవీ భానోజీరావు, నాగభూషణరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు బుగత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబసభ్యులకు మతిస్థిమితంలేని యువకుడి అప్పగింత



కుటుంబసభ్యులకు అజయ్‌ను అప్పగిస్తున్న వన్‌టౌన్ సీఐ వెంకటరావు

విజయనగరం క్రైమ్: మతిస్థిమితం లేని 19 ఏళ్ల యువకుడ్ని వన్‌టౌన్ పోలీసులు కుటుంబసభ్యుల చెంతకు చేర్చారు. మతిస్థిమితం లేని యువకుడు పట్టణంలో అనుమానాస్పదంగా తిరుగుతుండడం చూసిన వన్‌టౌన్ హెచ్‌సీ ఆవు వెంకటరమణ, ట్రాఫిక్ పోలీసులు స్టేషన్‌కు ఆదివారం తీసుకువచ్చారు. వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు ఆ యువకుడిని విచారణ చేసి కృష్ణాజిల్లా పామాడ మండలం యజ్ఞవరం గ్రామానికి చెందిన జన్న అజయ్ బాబుగా గుర్తించారు. వెంటనే వారి కుటుంబసభ్యులకు సమాచారమందించారు. వారు స్టేషన్‌కు రాగా అజయ్‌ను అప్పగించారు. ఈ మేరకు అజయ్ కుటుంబ సభ్యులు సీఐకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

పేకాట రాయళ్ల అరెస్టు



పోలీసుల అదుపులో ఉన్న పేకాటరాయళ్లు

గంట్యాడ: మండలంలోని జగ్గాపురం ప్రాంతంలో కొంతమంది పేకాట ఆడుతున్నట్టు పోలీసులకు సమాచారం రాగా ఆదివారం సాయంత్రం దాడిచేసి 8మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారిని అరెస్టు చేసి వారి నుంచి రూ.12,920 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

మద్యం అక్రమ అమ్మకాలపై పోలీసుల దాడి

- 116 మద్యం బాటిల్స్ స్వాధీనం



కొత్తవలస: పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలతో నిందితులు

కొత్తవలస: స్థానిక సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని దేశపాత్రునిపాలెం, చిన్నిపాలెం గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మకాలపై ఆదివారం దాడులు నిర్వహించారు. దేశపాత్రునిపాలెం గ్రామానికి సమీపంలో గల 202 కాలనీకి చెందిన ఎర్రా మహేష్‌ను అదుపులోకి తీసుకుని వంద మద్యం సీసాలు, చిన్నిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు అప్పలరాజు వద్ద 16 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ ఈ సందర్భంగా తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

కేజీపూడిలో 20..

వేపాడ: మండలంలోని కేజీ పూడి గ్రామంలో వల్లంపూడి పోలీసులు, ఎక్సైజ్ శాఖ సిబ్బంది నిర్వహించిన దాడుల్లో 20 మద్యం సీసాలు పట్టుబడినట్లు ఏఎస్సై బీవీ రమణ తెలిపారు. ఆదివారం నిర్వహించిన దాడుల్లో గ్రామానికి చెందిన సీహెచ్ శ్రీనివాసరావువద్ద 20 మద్యం సీసాలు పట్టుబడడంతో స్వాధీనం చేసుకుని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గిరికిపాడులో 46..

సంతకవిటి: మండల పరిధిలోని గరికిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తి దగ్గర 46 మద్యం బాటిల్స్ పట్టుబడ్డాయి. గ్రామం సమీపంలో నిందితుడిని పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై ఎం. వాసుదేవరావు తెలిపారు.

ఉంగరాడ మెట్టలో 35..

రేగిడి: మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలో అక్రమంగా మద్యం బాటిల్స్ తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై ఇ.శ్రీనివాసరావు తెలిపారు. ఆ వ్యక్తి అక్రమంగా తరలిస్తున్న ఈ 35 మద్యం బాటిల్స్ సీజ్ చేసినట్లు వెల్లడించారు.

గడిముడిదాంలో 100..

రాజాం సిటీ: మండల పరిధి గడిముడిదాం గ్రామ కోనేరు సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 100 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నామని సీఐ కె.రవికుమార్ ఆదివారం తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు ఎస్సై వై.రవికిరణ్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడిచేయగా అక్రమంగా మద్యం తరలిస్తున్న బుచ్చెంపేట గ్రామానికి చెందిన కోరాడ సత్యంను అరెస్టు చేసి మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం



ట్రోఫీతో క్రీడాకారుడు రాజ్‌కుమార్

పాలకొండ రూరల్: పట్టణానికి చెందిన కొప్పర రాజ్‌కుమార్ అనంతపురంలో నిర్వహించిన బాల్‌బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి సీనియర్స్ విభాగంలో సత్తాచాటినట్లు కోచ్ గర్భాపు సింహాచలం ఆదివారం తెలిపారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించిన ఈ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం దక్కించుకున్నట్లు వివరించారు. దీంతో రాజ్‌కుమార్ ఫిబ్రవరి 17వ తేదీ నుంచి బెంగళూరులో జరగనున్న ఆలిండియా నేషనల్స్‌లో తలపడనున్నట్లు చెప్పారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో 108 పైలట్ ప్రతిభ



స్వర్ణ పతకం అందుకుంటున్న ఎంఎస్ఎన్ మూర్తి

శృంగవరపుకోట: అపర సంజీవినిగా పేరుపడిన 108 వాహనంలో పనిచేసే పైలట్ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్-2024లో పతకాలు పట్టాడు. రెండు రోజులుగా విశాఖపట్నంలోని రైల్వే గ్రౌండ్స్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ నేతృత్వంలో నిర్వహించిన 41వ రాష్ట్ర మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్.కోటలో 108 వాహన పైలట్‌గా పనిచేస్తున్న ఎంఎస్ఎన్.మూర్తి 40+ విభాగంలో పోటీపడిన మూడు ఈవెంట్లలో పతకాల పంట పండించాడు. హేమర్ త్రో, జావెలిన్ త్రోలో మొదటి స్థానంలో నిలిచి స్వర్ణపతకాలు, డిస్క్ త్రోలో రజత పతకం సాధించాడు. కొన్నేళ్లుగా వరుసగా మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో పతకాలు సాధిస్తున్న ఎంఎస్ఎన్‌మూర్తిని స్థానికులు, క్రీడాభిమానులు అభినందించారు.

మాస్టర్ అథ్లెటిక్స్ శాంతారావు ప్రతిభ

డెంకాడ: మండలంలోని గుణుపూరుపేట జిల్లా పరిషత్ పాఠశాల గణిత ఉపాధ్యాయుడు జి.శాంతారావు నడక, పరుగు పందెం పోటీల్లో ప్రతిభ కనబరిచారు. విశాఖపట్నంలోని రైల్వేగ్రౌండ్‌లో జరుగుతున్న ఆంధ్రప్రదేశ్ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలో 5 కిలో మీటర్ల నడక పోటీలో బంగారు పతకం, 5 కిలో మీటర్ల పరుగు పందెంలో వెండి పతకం సాధించారు. దీంతో ఉపాధ్యాయుడు శాంతారావుకు పాఠశాల హెచ్ఎం కృష్ణకుమారి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.



క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి అవార్డు అందుకుంటున్న గుణుపూరుపేట గణిత ఉపాధ్యాయుడు శాంతారావు

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

- అపస్మారక స్థితిలో మరో యువకుడు



సివేరి రవి మృతదేహం



అపస్మారక స్థితిలో రామన్న

శృంగవరపుకోట: మండలంలోని కృష్ణాపురం గ్రామంలో ఉన్న కోళ్లఫారం వద్ద ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందగా మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది. ఈ విషయంపై స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. అనంతగిరి మండలం డొంకపుట్టు గ్రామానికి చెందిన సివేరి రవి(20) ఎస్.కోట పట్టణంలోని ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నాడు. అనంతగిరి మండలం పెనంతి గ్రామానికి చెందిన చొంపి రామన్న(19) ఎస్.కోటలోని విశ్వభారతి ఒకేషనల్ కళాశాలలో చదువుతున్నాడు. వారిద్దరూ ఇటీవల కృష్ణాపురం గ్రామంలోని కోళ్లఫారానికి కాపలా ఉంటామని యజమానితో ఒప్పందం కుదుర్చుకుని పదిహేను రోజులుగా కోళ్లఫారం వద్ద ఉంటున్నారు. యువకులిద్దరూ ఉదయం కోళ్లఫారంలో పనులు చూసుకుని, కాలేజీకి వెళ్లిపోయి, తిరిగి కాలేజీ నుంచి వచ్చిన తర్వాత కోళ్లఫారంలో పనులు చూసుకుంటూ ఉండేవారు. కాగా ఆదివారం ఉదయం వారిద్దరూ కోళ్లఫారం వద్ద పడి ఉండడాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే గ్రామస్తులు, పోలీసులు వారిని ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే రవి చనిపోయినట్లు గుర్తించిన వైద్యులు, రామన్నను విజయనగరం ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆస్పత్రిలో రామన్న పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. సారా తాగడం వల్ల యువకులిద్దరూ ప్రమాదస్థితికి చేరి ఉంటారని స్థానికులు చెబుతుండగా, యువకుల కుటుంబీకులు స్థానిక తమ బిడ్డల్ని చంపే ప్రయత్నం చేశారంటూ ఆరోపిస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు మాట్లాడుతూ దర్యాప్తు పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామని చెప్పారు.

రైలు ఢీకొని యువకుడు..



అశోక్‌కుమార్ మృతదేహం

పార్వతీపురంటౌన్: పార్వతీపురం-నర్సిపురం రైల్వేట్రాక్ మధ్యలో రైలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటనపై జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ రత్నాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రైల్వేట్రాక్‌పై పడి ఉన్న గుర్తుతెలియని యువకుడి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు పరిశీలించి కొండవాడ గ్రామానికి చెందిన తోయక అశోక్‌కుమార్ (31)గా గుర్తించారు. అయితే ఇది హత్యా? ఆత్మహత్యా? అన్న కోణంలో దర్యాప్తు చేపడుతున్నట్లు హెచ్‌సీ చెప్పారు. మృతదేహానికి పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

మన్యంలో పర్యాటకుల సందడి

సీతంపేట ఏజెన్సీలో పర్యాటకులు ఆదివారం సందడి చేశారు. అడ్వెంచర్ పార్కులో షూటింగ్, జెయింట్‌వీల్ వంటి సాహస క్రీడల్లో పాల్గొన్నారు. జలవిహార్‌లో బోటు షికారు చేశారు. చిన్నారులు బొమ్మ ట్రైన్‌పై ఆడుకున్నారు.

– సీతంపేట



బొమ్మట్రైన్‌పై చిన్నారులు



షూటింగ్ చేస్తున్న చిన్నారులు